# చావు సందేశం!

దేశంలో అనేకులు చస్తూంటారు. కానీ అదేమిటో? తెలుగువాడు మాత్రం చావడు. స్వర్గస్థుడయ్యెను. శివసాయుజ్యము నందెను. పరమపదము చేరెను. భౌతికకాయము విడిచెను. మరణించెను. కాలము చేసెను. ఇవీ మన మాటలు .అంతేకాని చనిపోయెను అనరు. శ్రద్ధాంజలి ఘటించినప్పుడు మనం ఇచ్చే పత్రికా ప్రకటనలు ఫొటోలతో సహ ఇలాగే వుంటాయి.

ఓ ముసిల్ది ఓ సాయంకాలం - కాలం చేసింది. రాత్రి దహనం చేయడం తగదు. శవ బంధువులందరికీ కబుర్లు పెట్టి, ఫోన్లు కొట్టి రప్పించాలి. తెల్లవారిన తరువాతనే దహనం ఏర్పాట్లు చెయ్యాలి. ఈలోగా చుట్టుప్రక్కల వారువచ్చి ఏడుస్తున్న వారితో శ్రుతి కలిపేరు. శవం దుర్గంధం కొట్టకుండా కర్పూరం,సెంటు తెప్పించారు. శవం ముఖం నుండికాళ్లవరకూ కర్పూరం జల్లేరు. సెంటు కూడా అలాగే.

శవ బంధువులు రోదిస్తూంటే ఓదార్చడానికి వచ్చిన వాళ్లలో ఒక్కొక్కరూ ఒక్కొక్క మాటా అంటున్నారు. అదేమి విచిత్రమో కాని,ఎన్ని రేపులు మర్డర్లు చేసినవాడు చచ్చినా 'ఈ వెధవ పీడ విరగడైంది' అనరు. అది మన భారతీయుల సత్సంప్రదాయం!
" ఏడవకండమ్మా! పుట్టినవాళ్లు గిట్టక తప్పదు. మనం ఎంత ఏడ్చినా పోయినవాళ్లు తిరిగి రారు కదా? "

''మనం కట్టుకున్న బట్ట కాలక్రమేణ చిరిగిపోతే కొత్త బట్టలు కుట్టించుకుంటాం.మాసికలతో ఎన్నాళ్లుంటాం? ఈ శరీరం చిరిగిన బట్ట!

ఒక కొలనులో మంచినీళ్లు తెచ్చుకుందామని వెళ్లిన నలుగురు పాండవుల్ని అంటే భీమ అర్జున నకుల సహదేవులను కొంగరూపంలో ఉన్న యక్షుడు సంహరిస్తాడు. వాళ్లు యక్షుని ప్రశ్నలకు సమాధానం చెప్పలేనందుకు ఆ శిక్ష! అప్పుడు ధర్మరాజు బయలుదేరి యక్షుని ప్రశ్నలకు సంతృప్తికరమైన సమాధానాలిస్తాడు. ఆ యక్ష ప్రశ్నలలో

మరణం పై ఒకటి. ప్రపంచంలోని విచిత్రాలలో అతి విచిత్రమైనదేది? దానికి ధర్మరాజు సమాధానం చెబుతూ - మనిషి మరణించినప్పుడు ఆ శవాన్ని చూసి బంధుమిత్రులు రోదిస్తారు. వాళ్ల మాత్రం చావనట్లుగా అదే వింతల్లో వింత! అంటాడు".

"మరణం అన్నది శరీరానికి కాని ఆత్మకి కాదు. శరీరం వేరు ఆత్మవేరు.

"తెల్లవార్లూ శవజాగరణ చేస్తున్న వాళ్లకి తిళ్లూ తిప్పలూ లేవు. వచ్చిన బంధువులెవరో ఓ నలభై టిఫిన్ పొట్లాలూ,వాటర్ ప్యాకెట్లూ తెచ్చేరు. కొద్దిసేపు ఏడ్పులూ మొర్రలూ ఆపి, టిఫిన్లు తిని మంచినీళ్లు తాగేరు. టిఫిన్లు పూర్తియిన తరువాత ఎక్కువుగా ఏడవడం వల్ల శోషించిపోయినవారికి మరి గొంతుక పెగల్లేదు. కాని ఇద్దరు యువతులు మాత్రం మళ్లీ వెక్కి వెక్కి ఏడుపు లంకించుకున్నారు.

పరామర్శకొచ్చిన చుట్టాలకు కొరుకుడు పడలేదు. కాలం చేసిన ముసిల్ది వీళ్లకి ఎక్కువ ఆస్తి ఇచ్చి వుంటుంది. అటువంటి ఉత్తమురాలు పోవడం వల్ల వీరిద్దరూ భోరుభోరున విలపిస్తున్నారు. కాబోలు అనుకున్నారు.

"ఎందుకమ్మా అంతలా ఏడుస్తున్నారు.? పోయిన వారు తిరిగీ రారని మీకు మాత్రం తెలియదా? ఏడవకండి తల్లులారా" అని కొందరు పెద్దవాళ్లు ఓదార్చేరు.

" మేము ఏడవడానికిక్కారణం అది కాదు బామ్మలారా! ఈ ముసిల్ది ఉదయమే చచ్చివుంటే సాయంత్రమే మావాళ్లు దహనం చేసి వుండేవారు. మేము టీవీ సీరియల్స్ మిస్సవకుండా చూద్దుము. ఈవిడ గారు సాయంత్రం చచ్చి మమ్మల్ని చంపింది.తెల్లవార్లూ శవజాగరం అయి టీవీ సీరియల్స్ మిస్సయేము. చావడం ఎలాగూ తప్పదు. ఈ చావడం ఏదో పొద్దున్నైనా చచ్చింది కాదు అని బాధ! " అన్నారా యువతులు యుగళగీతం పాడుతున్నట్టుగా.

ఆగస్టు 2005

'పత్రిక'మన మాసపత్రిక